తల్లికి వందనమా.. ద్రోహమా?

- 'తల్లికి వందనం' నగదు కోసం తల్లిదండ్రుల ఎదురుచూపు
- ఎంతమంది పిల్లలుంటే అంతమందికి పథకం అమలు చేస్తానంటూ చంద్రబాబు హామీ
- స్పష్టతలేని జీఓతో ఆందోళన





'మీ ఇష్టం ఎంతమంది పిల్లలను కంటారో కనండి. వారందరి చదువు బాధ్యత నేనే తీసుకుంటా. ఎంతమంది చదువుకునే పిల్లలుంటే అంతమందికి తల్లికి వందనం పథకం కింద ఏడాదికి రూ.15 వేలు ఇస్తా' అంటూ గత ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. అధికారం చేపట్టి నెలరోజులవుతున్నా.. విద్యాసంవత్సరం ప్రారంభమై 20 రోజులకు పైగా గడుస్తున్నా హామీ అమలు కాకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజుల క్రితం పథకం అమలుకు జీఓ విడుదలైనా ఎంత మంది పిల్లలకు ఇస్తారో స్పష్టంగా పొందుపరచకపోవడంతో తల్లికి వందనం పథకానికి మంగళం పాడతారా అంటూ పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

– కోడుమూరు రూరల్/సి.బెళగల్

నమ్మి ఓటేశాం



మాది పేద కుటుంబం. కూలీనాలీ చేసుకుని బతికేటోళ్లం. మాకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. ముగ్గురు పిల్లలు ప్రభుత్వ పాఠశాలలోనే చదువుతున్నారు. గతంలో జగనన్న ఏటా ఒకరికి అమ్మ ఒడి కింద నగదు నాఖాతాలో డబ్బు జమచేసేవారు. చంద్రబాబు ఎన్నికల హామీలో భాగంగా ఎంతమంది పిల్లలుంటే అంతమందికి పథకాన్ని అమలు చేస్తానన్నాడు. అందుకే నమ్మి ఓటేశాం. రూ.15వేల చొప్పున మా ముగ్గురు పిల్లలకు కలిపి రూ.45 వేలు రావాలి. ఆ డబ్బు కోసం ఎదురు చూస్తున్నాం.

– సునీత, ప్యాలకుర్తి గ్రామం, కోడుమూరు మండలం

విద్యార్థులందరికీ ఇవ్వాలి



నాకున్న ముగ్గురు పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపుతున్నాను. వారికి ప్రభుత్వం పుస్తకాలు, దుస్తులు ఇచ్చినా ఇతర ఖర్చులుంటాయిగా. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం చంద్రబాబు నాయుడు ఎంతమంది పిల్లలుంటే అంతమందికి తల్లికి వందనం పథకం డబ్బు ఇవ్వాలి. అప్పుడే మాలాంటి పేదలకు కొంత చదువుకు, మరి కొంత ఇతర ఖర్చులకు ఉపయోగపడుతుంది.

– చిన్నారి, సి.బెళగల్

మాట తప్పకూడదు



తల్లికి వందనం పథకం కింద ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున ఎంతమంది పిల్లలుంటే అందమందికి ఇస్తానని చెప్పిన మాట.. చంద్రబాబు తప్పకూడదు. నాకు ముగ్గురు సంతానం. ఒకరు ఇంటర్, ఒకరు ఎనిమిదవ తరగతి, మరొకరు ఐదవ తరగతి చదువుతున్నారు. మా ముగ్గురు పిల్లలకు కలిపి రూ.45 వేలు ఇవ్వాలి. లేకపోతే చంద్రబాబును జన్మలో నమ్మం.

– బాయికాటి లక్ష్మీదేవి, సి.బెళగల్

ఇచ్చిన హామీని నెరవేర్చాలి



నా కూతురు కేజీబీవీలో ఇంటర్, కుమారుడు జెడ్పీ పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్నారు. విద్యాసంవత్సరం ప్రారంభమై దాదాపు నెల రోజులవుతున్నా.. ఈ ప్రభుత్వం ఇంతవరకు తల్లికి వందనం పథకం ఊసే ఎత్తడం లేదు. చంద్రబాబు ఎన్నికల ము ముందు ఇచ్చిన మాట ప్రకారం మా ఇద్దరు పిల్లలకు ఒక్కొక్కరికీ రూ.15 వేల చొప్పున ఇద్దరికి కలిపి మొత్తం రూ.30 వేలు ఇవ్వాలి.

– బాణాల సునీత, గడివేముల

నియోజకవర్గంలో 1 నుంచి ఇంటర్ వరకు ఉన్న విద్యార్థుల వివరాలు

మండలం	విద్యార్థుల సంఖ్య
కోడుమూరు	15,643
గూడూరు	8,646
సి.బెళగల్	11,453

మాట నిలబెట్టుకోవాలి



మాకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చదివించుకుంటున్నాం. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం మాకు అమ్మకు వందనం పథకం కింద ముగ్గురు పిల్లలకు రూ.15 వేల చొప్పున రూ.45 వేలు ఇచ్చి మాట నెలబెట్టుకోవాలి. లేదంటే చంద్రబాబు మరోసారి మమ్మల్ని మోసం చేసినట్లే లెక్క.

– పద్మావతి, కోడుమూరు

నగదు కోసం ఎదురుచూస్తున్నాం



నాకు ఇద్దరు మార్తెలు. పాణ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్నారు. తల్లికి వందనం కింద ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున ఇద్దరికి కలిపి మొత్తం రూ.30 వేలు వస్తాయని ఎదురు చూస్తున్నాం. ఎప్పటిలాగే చంద్రబాబు మాట తప్పుతారో. పథకాన్ని అమలు చేసి మాట నెలబెట్టుకుంటారో చూడాలి.

– కవిత, పాణ్యం

క్లుప్తంగా

సుబ్రమణ్యేశ్వరుడికి పూజలు



ప్రత్యేక అలంకరణలో శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వరస్వామి

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో గురువారం ఆషాడమాసం స్కంద షష్టి పూజలు నిర్వహించారు. స్వామి వారికి స్కంద పంచమి షష్టి పురస్కరించుకుని ప్రాతఃకాల పూజ, అఖండ అభిషేకం, అర్చనలు, విశేష పూజలు, నిర్వహించినట్లు తెలిపారు. పలుప్రాంతాల నుంచి భక్తులు హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. పూజల్లో ఈఓ రామకృష్ణ, అర్చకులు నారాయణస్వామి, సురేష్‌స్వామి పాల్గొన్నారు.

సారా బట్టీల ధ్వంసం



నాటు సారా బట్టీని ధ్వంసం చేస్తున్న సెబ్ అధికారులు

కోడుమూరు రూరల్: వెల్దుర్తి మండలం ఎల్.బండ తండా గ్రామంపై సిబ్బందితో దాడులు నిర్వహించి రెండు చోట్ల నాటు సారా బట్టీలను ధ్వంసం చేసినట్లు సెబ్ సీఐ రామాంజనేయులు గురువారం తెలిపారు. రెండు చోట్ల నాటుసారా బట్టీల్లో సారా తయారీకి సిద్ధంగా ఉన్న 1,275 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేయడంతో పాటు, కేసులు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు. దాడుల్లో సెబ్ సిబ్బంది హనుమంతు, విరూపాక్షిరెడ్డి, శంకర్ నాయక్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి



మాట్లాడుతున్న ఎంఈఓ ఓంకార్ యాదవ్

ఓర్వకల్లు: విద్యార్థులకు మధ్యాహ్నం నాణ్యమైన భోజనం పెట్టాలని ఎంపీడీఓ మల్లీశ్వరి సూచించారు. గురువారం స్థానిక మోడల్ స్కూల్‌లో ఎంఈఓ ఓంకార్ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడారు. మధ్యాహ్న భోజనం తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. పాఠశాలల ప్రాంగణాలలో మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. అనంతరం ఎంఈఓ ఓంకార్ యాదవ్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమయపాలన పాటించాలన్నారు. సమావేశంలో సీఆర్‌పీలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

విరివిగా మొక్కలు నాటాలి



అంగన్‌వాడీ కార్యకర్తలకు మొక్కలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఓర్వకల్లు: మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో మొక్కలు నాటి పెంచాలని ఎంపీడీఓ మల్లీశ్వరి అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులకు 'ప్లాంట్ ఫర్ మదర్' కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నుంచి 'ప్లాంట్ ఫర్ మదర్'(తల్లి కోసం ఒక మొక్క) కార్యక్రమాన్ని త్వరలోనే ప్రారంభించనున్నట్లు తెలిపారు. అందుకు ప్రతి ఒక్కరు సన్నద్ధమవ్వాలని సూచించారు. పిల్లలకు పోషకాహారాలతో పాటు, చక్కటి విద్యను అందించాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తకు మొక్కలు పంపిణీ చేశారు.

పశుసంపద అభివృద్ధిపై దృష్టి సారించాలి



పోలకల్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మల్లన్న

సి.బెళగల్: పాడి రైతులు పశు సంపద అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని డాక్టర్ మల్లకల్ అన్నారు. గురువారం సి.బెళగల్ మండలంలోని పోలకల్ గ్రామ పశు వైద్యశాలలో డాక్టర్ రోనాల్డ్ రీచర్డ్స్ గర్భకోశ వ్యాదులకు ఉచిత చికిత్స శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి కర్నూలు జిల్లా పశుగాణాభివృద్ధి సంస్థ ఏడీ డాక్టర్ మల్లన్న, ఎంపీపీ బొంతల మునెప్ప ముఖ్య అతిథులుగా హాజరై పాడి రైతులకు అవగాహన కల్పించారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్‌లో భాగంగా గ్రామానికి చెందిన 25 పశువులకు చికిత్సను అందించి, ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు అమర్, పాడి రైతులు, పశు వైద్యశాల సిబ్బంది ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయించండి



బురాన్‌దొడ్డి హౌసింగ్ కాలనీల తనిఖీ చేస్తున్న పీడీ సిద్ధాలింగమూర్తి

సి.బెళగల్: గ్రామాలలోని హౌసింగ్ కాలనీలలో లబ్ధిదారులు నిర్మించుకుంటున్న ఇళ్లను వందరోజుల్లో పూర్తి చేయించాలని జిల్లా హౌసింగ్ పీడీ సిద్ధాలింగమూర్తి మండల అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన మండలంలో పర్యటించి హౌసింగ్ కాలనీలను తనిఖీ చేశారు. మండల అధికారులతో కలిసి మండల పరిధిలోని బురాన్‌దొడ్డి హౌసింగ్ కాలనీని తనిఖీ చేశారు. లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ దశాలు పూర్తి అయిన వెంటనే బిల్లులు చెల్లింపు అయ్యేలా చూడాలని లబ్ధిదారులు కోరడంతో, పీడీ సానుకూలంగా స్పందించారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్ ఈఓఆర్డీ సందీప్, మండల హౌసింగ్ ఏఈ సుమంత్‌లతో కలిసి గ్రామ సచివాలయ ఇంజనీర్ అసిస్టెంట్లు, ఉపాధి హామి సిబ్బందితో గృహ నిర్మాణాలపై సమీక్ష సమావేశంను నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ, హౌసింగ్ కాలనీ లేఅవుట్లలో, లబ్ధిదారులు వారి సొంత స్థలాల్లో నిర్మించుకుంటున్న గృహ నిర్మాణాలు మూడు నెలలోగా పూర్తి అయ్యేలా చూడలని ఆదేశించారు. గృహ నిర్మాణాల్లో ఉపాధిహామీ పథకంలో భాగంగా చేపట్టిన పనిదినాలను వివరాలను నమోదు చెసి లబ్ధిదారులకు బిల్లుల వివరాలను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని సూచించారు. సమావేశంలో ఉపాధిహామి ఏపీఓ లక్ష్మన్న, టీఏలు తదితరులు ఉన్నారు.

చిన్న కుటుంబం.. చింత లేని కుటుంబం



కోడుమూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కోడుమూరు రూరల్: చిన్న కుటుంబం..చింత లేని కుటుంబమని.. బాలికలంతా యుక్త వయస్సులోనే వివాహాలు చేసుకోవాలని కోడుమూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రీమంత్ మాదన్న సూచించారు. గురువారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని కోడుమూరులో ర్యాలీ నిర్వహించారు. బాలికల హైస్కూల్లో బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు– చిన్న కుటుంబాల విశిష్టత– అధిక జనాభా వల్ల కలిగే నష్టాలపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. డాక్టర్ శ్రీమంత్ మాదన్న మాట్లాడుతూ చిన్న వయస్సులో వివాహాల వల్ల బాలికల్లో అనారోగ్యం, రక్తహీనత, అకాల గర్భం, ప్రసూతి మరణాలు సంభవిస్తాయని, ప్రతి ఒక్కరూ యుక్తవయస్సు వచ్చిన తర్వాతనే వివాహాలు చేసుకోవాలన్నారు. బాలికలంతా ఉన్నత చదువులు చదుకోవడం ద్వారా ఆ కుటుంబాలు బాగుపడడంతో పాటు, సమాజం బాగుపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ నరసప్ప, హెల్త్ సూపర్‌వైజర్లు ఉమాబాయి, కమాల్ సాహెబ్, హెచ్ఎం శ్రీదేవి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీసీఆర్సీలతో బహుళ ప్రయోజనం



సీసీఆర్సీలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ అనుపమ

సి.బెళగల్: సీసీఆర్సీలతో రైతులు బహుళ ప్రయోజనాలు పొందవచ్చని, పంట పొలాలను కౌలుకు తీసుకొని సాగుచేసే రైతులు సీసీ ఆర్సీలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ అనుపమ అన్నారు. గురువారం స్థానిక రైతు సేవా కేంద్రంలో సీసీఆర్సీల అవసరాలపై మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేష్‌కుమార్ రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. కౌలు రైతుకు పంట రుణాలు, పంట నష్ట పరిహారం, ప్రభుత్వం నుంచి సబ్సిడీపై మంజూరు అయ్యే విత్తనాలు, ఎరువులకు తదితర వాటికి అర్హతలు లభిస్తాయన్నారు. కాగా మండలంలో గతేడాది 530 మంది రైతులు సీసీఆర్సీలు పొందారని, వారిలో 11 మంది రైతులు కార్డులను రెవెన్యూవల్ చేసుకున్నారని చెప్పారు. ఈనెల 27వ తేదీలోగా రైతులు ఆయా గ్రామాల్లోని వీఆర్వోలను, రైతు సేవా కేంద్రాలలో వీఏఏలను సంప్రదించి కార్డులను పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు వీరన్న గౌడ్, వీఆర్వోలు శేఖర్, నాగమ్మ, రైతులు, వ్యవసాయ సహాయకులు అసీఫ్ ఉన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి సంఘాలు



ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులు

పాణ్యం: పగిద్యాల మండలం కొత్త ముచ్చుమర్రి గ్రామానికి చెందిన బాలిక అదృశ్యానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. గురువారం ఆర్‌వీఎఫ్, ఏఐఎస్‌బీ సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌వీఎఫ్ రాష్ట్ర నాయకులు రాజు నాయడు, రవీంద్రనాథ్, ఏఐఎఫ్‌బీ నాయకుడు వెంకటాద్రి, ఎస్ఎఫ్ఐ నాయకులు బత్తిన ప్రతాప్, బాలక్రిష్ణ నాయక్ తదితరులు మాట్లాడుతూ బాలిక అదృశ్యాన్ని ఛేదించాలని డిమాండ్ చేశారు.

బాలిక ఆచూకీ కనుగొనాలి

ఓర్వకల్లు: పాత ముచ్చుమర్రి గ్రామానికి చెందిన బాలిక ఆచూకీని కనుగొనాలని ఆర్‌వీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీంద్ర డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో హాస్టల్ విద్యార్థినులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారి అదృశ్యమై రోజులు గడుస్తున్నా ఆచూకీ కనిపెట్టకపోవడం తగదన్నారు.

అంతర్‌రాష్ట్ర దొంగల అరెస్టు



అంతర్ రాష్ట్ర దొంగలను అరెస్టు చేసిన పోలీసులు

కర్నూలు (అర్బన్): తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్‌రాష్ట్ర దొంగలను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి బంగారు నగలను స్వాధీనం చేసుకున్నట్లు కర్నూలు నాల్గవ పట్టణ పోలీసులు తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 28న నగరంలోని గోపీ నగర్, జూన్ 20న బాబా బృందావన్ నగర్‌లోని ఇళ్లల్లో వీరు దొంగతనాలకు పాల్పడ్డారు. కేసు నమోదుచేసుకున్న ఎస్ఐ పి.మోహన్ కిషోర్‌రెడ్డి, క్రైం పార్టీ సిబ్బంది గురువారం కందుల సత్యనారాయణ, కుందుర్తి రవికుమార్ అనే వ్యక్తులను అరెస్టు చేసి జత బంగారు బుట్ట కమ్మలు, గాజు, నల్లపూసల దండ, నెక్లెస్ డాలర్, చైను, బ్రాస్‌లైట్, రెండు ఉంగరాలు కలిపి మొత్తం 9.50 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే దొంగతనాలు చేసేందుకు ఉపయోగించిన ఒక పల్సర్‌బైక్, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. దొంగిలించిన కొంత సొత్తును పిడుగురాళ్లలోని ముత్తూట్ ఫైనాన్స్‌లోని కుదువపెట్టిన సొమ్ముకు సంబంధించిన రసీదును కూడా స్వాధీనం చేసుకుని, నిందితులను రిమాండ్ నిమిత్తం కర్నూలు జేఎంఎఫ్‌సీ కోర్టులో హాజరుపరిచారు.

ఆలయంలో చోరీ

పాణ్యం: మండల కేంద్రంలోని రైల్వేగేటు వద్ద ఉన్న మంజునాథస్వామి, కనకదుర్గా అమ్మవారి ఆలయంలో చోరీ జరిగినట్లు ఆలయ నిర్వాహకులు వెంకట సుబ్బయ్య గురువారం తెలిపారు. ఆలయంలో మంజునాథస్వామికి అలంకరించిన కేజీ వెండి, వన్‌గ్రామ్ గోల్డ్‌ను ఎత్తుకెళ్లారన్నారు. ఉదయాన్నే ఆలయానికి వచ్చి చూడగా ఆభరణాలు కనిపించకపోవడంతో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక



బీ.జగన్ (ఇడుపులపాయ), కె.వంశీ (ఒంగోలు)

సి.బెళగల్: మండలంలో చదువుకున్న ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లకు ఎంపికయ్యారు. మండలం కేంద్రం సి.బెళగల్లోని బీసీ హాస్టల్లో ఉంటూ స్థానిక మోడల్ స్కూల్లో 10వ తరగతి చదివి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో 569 మార్కులతో మండల టాపర్‌గా నిలిచిన గుండేవుల విద్యార్థి బీ.జగన్ ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌కు ఎంపికయ్యాడు. అదేవిధంగా గోనేగండ్ల మండలం అలువాల గ్రామానికి చెందిన బీసీ హాస్టల్ విద్యార్థి కె.వంశీ పదవ తరగతిలో 568 మార్కులతో మండల సెకండ్ టాపర్‌గా నిలిచి, ఒంగోలు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌కు ఎంపిక అయ్యాడు. ఎంపికైన విద్యార్థులను సి.బెళగల్ బీసీ హాస్టల్ వార్డెన్ రమేష్, హాస్టల్ సిబ్బంది అభినందించారు.

కౌలు కార్డుకు దరఖాస్తు చేసుకోండి

గడివేముల: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు భూమిలేని రైతులు కౌలుకు తీసుకున్న అన్నదాతలందరూ కౌలు కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ హేమసుందర్ రెడ్డి గురువారం తెలిపారు. ఏఓ మాట్లాడుతూ కౌలు కార్డు ఉంటే ప్రభుత్వం అందించే సబ్సిడీలు అందుతాయన్నారు. కావాల్సిన రైతులు స్థానిక వీఆర్వో వద్ద దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రేపటి నుంచి రాష్ట్ర స్థాయి ఈత పోటీలు

కర్నూలు కల్చరల్: కర్నూలు డిస్ట్రిక్ట్ ఆక్వాటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 13, 14 తేదీల్లో రాష్ట్ర స్థాయి ఈత పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి జి.రామకృష్ణ యాదవ్ పేర్కొన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 9వ సబ్ జూనియర్, జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ ఆక్వాటిక్ ఛాంపియన్ షిప్ పోటీలు కిసాన్ ఘాట్ సమీపంలోని డీఎస్ఏ స్విమ్మింగ్‌పూల్‌లో నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. మొత్తం 90 ఈవెంట్లలో సుమారు 350 బాలబాలికలు పోటీ పడుతున్నారన్నారు. సమావేశంలో కోశాధికారి దస్తగిరి, జాయింట్ సెక్రటరీలు శివరాజ్, రామకృష్ణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి హజరతయ్య పాల్గొన్నారు.

అడ్మిషన్లు ప్రారంభం

కర్నూలు కల్చరల్: తిరుపతిలోని కలినరీ ఆర్ట్స్ ఇన్‌స్టిట్యూట్‌లో 2024–25 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ఇన్‌స్టిట్యూట్ హెడ్ త్రిలోక్ చందర్ తెలిపారు. గురువారం స్థానిక త్రిగుణ క్లార్క్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అడ్మిషన్ల బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమావేశంలో త్రిగుణ క్లార్క్ ఇన్ జీమ్ బాబ్ కుమార్, ఫైనాన్స్ కంట్రోలర్ రమేష్, చీఫ్ ఇంజినీర్ దీపక్‌కుమార్, కిచెన్ ఇన్‌చార్జ్ సందీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి

- రాష్ట్రీయ బాలస్వాస్త్య అధికారిణి హేమలత



పోస్టర్‌ను విడుదల చేస్తున్న హేమలత

ఓర్వకల్లు: విద్యార్థినులు పరిసరాల పరిశుభ్రతతో పాటు, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని రాష్ట్రీయ బాల స్వాస్త్య కార్యక్రమ అధికారిణి హేమలత సూచించారు. గురువారం స్థానిక కేజీబీ విద్యాలయాన్ని సందర్శించారు. పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ విద్యార్థినులు ప్రతిరోజు చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అపరిశుభ్ర చేతులతో నోరు, ముక్కు, కళ్ల భాగాలను తాకడం వల్ల అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందన్నారు. అపరిశుభ్ర వస్తువులు, పదార్థాలు, ప్రదేశాలను తాకినప్పుడు చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలన్నారు. అతిసారం, దోమకాటు వల్ల వచ్చే వ్యాధుల తీవ్రతను తెలుసుకోవాలన్నారు. ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకునేలా తమ తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. దోమలు కుట్టకుండా దోమతెరలను వాడాలన్నారు. ప్రతిఒక్కరూ సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగివుండాలన్నారు. అనంతరం అతిసార వ్యాధి నివారణ సూచనల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునంద, సునీత, సచివాలయ ఏఎన్ఎం విజయమ్మ పాల్గొన్నారు.

కౌలు కార్డుతో ప్రభుత్వ పథకాల వర్తింపు



రైతులకు మినీ కిట్లను పంపిణీ చేస్తున్న ఏఓ సుధాకర్

ఓర్వకల్లు: కౌలు కార్డులు ఉంటే ప్రభుత్వ పథకాల వర్తిస్తాయని వ్యవసాయాధికారి సుధాకర్ అన్నారు. గురువారం మండలంలోని హుసేనాపురం, కాల్వ గ్రామాలలో కౌలు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సుధాకర్ మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి కౌలు రైతులు కౌలు కార్డు కోసం ఈ నెల చివరిలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. సమీపంలోని రైతు సేవాకేంద్రాల వద్దకు వెళ్లి వ్యవసాయ సహాయకులు/వీఆర్ఓలను సంప్రదించి ధ్రువపత్రాలను అందజేయాలన్నారు. కౌలు కార్డు వలన రైతులకు ఈ–పంట నమోదు, అతివృష్టి, అనావృష్టి వల్ల కలిగే పంటనష్ట పరిహారం, పంటల బీమా, కనీస మద్దతు ధరలకు ఉపయోగపడుతుందన్నారు. కార్డు కాల వ్యవధి 11 నెలల మాత్రమే ఉండడంతో రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లదన్నారు. అనంతరం రైతులకు పొద్దుతిరుగుడు మినీ కిట్లు(చిరు సంచులు) రకం ఎన్‌డీహెచ్–1012 వంటి హైబ్రిడ్ రకం విత్తనాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఈఓలు భాస్కర్, మధు, వీఏఏలు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

- మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కల్లూరు: అధికారులు సమన్వయంతో పనిచేయాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి సూచించారు. గురువారం ఎంపీపీ బోయ శారద అధ్యక్షతన నిర్వహించిన కల్లూరు మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముందుగా మండల స్థాయి అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. పర్ల గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కారించాలని ఎంపీటీసీ మేకల శేషన్న సభ దృష్టికి తీసుకువచ్చారు. ఉలిందకొండలో నీటి సమస్యను వైస్ ఎంపీపీ–1 చంద్రకళ సభ దృష్టికి తెచ్చారు. కె.మార్కాపురం, తడకనపల్లె గ్రామాల్లో కుళ్లాయి కనెక్షన్ల సమస్యలను పరిష్కరించాలని ఆయా గ్రామాల సర్పంచ్‌లు మద్దిలేటి, సాహెరాబీ సభకు విన్నవించారు. మండలంలో నాలుగు పాఠశాలలు సీబీఎస్ఈ సిలబస్‌లో బోధన జరగుతుందని ఎంఈఓ–1 శ్రీనివాసులు సభలో తెలిపారు. నాలుగు ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ అయినట్లు సభలో తెలిపారు. పెద్దపాడు బ్రిడ్జిపై గుంతలు ఏర్పడాయని సల్కాపురం సర్పంచ్ మద్దిలేటి తెలిపారు. గ్రామాల్లో జరిగే ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రొటోకాల్ ప్రకారం ఎంపీటీసీలను ఆహ్వానించాలని పెద్దటేకూరు ఎంపీటీసీ మునిస్వామి కోరారు. హంద్రీ నదిలో అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని వైస్ ఎంపీపీ–2 చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. సర్వసభ్య సమావేశాలకు విద్యుత్ అధికారులు హాజరుకావడం లేదని, గ్రామాల్లో విద్యుత్ సమస్యలు, అవసరమైన చోట్ల స్తంభాల ఏర్పాటు విషయాలు ఎవరికి చెప్పాల్లో అర్థం కావడం లేదని సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ మునివేలు పాల్గొన్నారు.

విద్యార్థి కిట్లను పక్కాగా అందించాలి



బీసీ బాలికల పాఠశాల పరిసరాలను పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకులు పెంచలయ్య

పాణ్యం: విద్యార్థి కిట్లను పక్కాగా అందించాలని విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకులు పెంచలయ్య సూచించారు. గురువారం ఆయన నెరవాడ మెట్ట వద్ద ఉన్న బీసీ బాలికల పాఠశాల, గిరిజన గురుకుల బాలికల పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి కిట్ అందాలన్నారు. తాగునీరు, ఆహార పదార్థాలను పరిశీలించి విద్యార్థులకు అందించాలన్నారు. డయేరియా, ఇతర వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం తరగతి గదులు, మరుదొడ్లు, ల్యాబ్స్, డిజిటల్ క్లాస్ రూంలను పరిశీలించారు. ఆయన వెంట ఎంఈఓలు కోటయ్య, సుబ్రమణ్యం, ప్రిన్సిపాల్స్ ఫ్లోరమ్మ, మేరి సలోమీ ఉన్నారు.

నేటి నుంచి థిమాటిక్ ఎగ్జిబిషన్

కర్నూలు(అగ్రికల్చర్): స్థానిక కొండారెడ్డి బురుజు సమీపంలోని లేపాక్షి హ్యాండిక్రాఫ్ట్ ఎంపోరియం వద్ద గురువారం నుంచి ఈనెల 16వ తేదీ వరకు థిమాటిక్ ఎగ్జిబిషన్ నిర్వహించేందుకు ఏపీ హ్యాడ్ క్రాఫ్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అనుమతి ఇచ్చిందని మేనేజర్ తిమ్మయ్య గురువారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ హస్తకళల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న థిమాటిక్ ఎగ్జిబిషన్‌లో కొండపల్లి బొమ్మలు, ఏటికొప్పాక బొమ్మలు, కలంకారి వస్తువులు, జ్యూట్ బ్యాగ్‌లు, హ్యాండ్‌మేడ్ గాజులు, వైట్ మెటల్ బొమ్మలు, రోజ్ ఉడ్ బొమ్మలు అందుబాటులో ఉంటాయన్నారు. 10 శాతం వరకు డిస్కౌంటు ఉంటుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.